వేసవి కాలం.. పశువులు భద్రం


ముడిపల్లెలో ఎండలో మేస్తున్న ఆవులు

- పొంచివున్న వడదెబ్బ ముప్పు
- నిర్లక్ష్యం వహిస్తే మృత్యువాత పడే అవకాశం

నగరి: మూగజీవాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయి. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గడమే కాకుండా, ప్రాణాపాయ పరిస్థితులను మూగజీవాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పశువుల శరీర ఉష్ణోగ్రతల కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు నియంత్రణ కోల్పోతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతుంది. అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే

వడదెబ్బ తగిలిన ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉంటుంది. చర్మ మృదత్వం తగ్గిపోయి గట్టిపడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారటం జరుగుతుంది. ఆవుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి, చూడికట్టే శాతం తగ్గుతుంది. ఎద్దుల్లో వంధత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలతో క్రమంగా కోమాలోకి వెళ్లి మత్యువాత పడతాయి.

నివారణ చర్యలు

వేసవిలో పశువులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేతకు బయటకు తీసుకువెళ్లకూడదు. చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలి. రోజుకు 4 నుంచి 5 సార్లు చల్లని నీటితో కడగడం, చెరువులు, కుంటలు ఉన్న చోట నీళ్లలోకి విడిచిపెట్టాలి. పశువుల కొట్టాలను ఎత్తుగా నిర్మించుకొని పైన ఎండు గడ్డితో కప్పి నీళ్లు చల్లుతూ ఉండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో సంచులు కట్టి నీరు చల్లుతుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న పచ్చిగడ్డి, పాతర గడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి పెట్టాలి. ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నప్పుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండ ధాటికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చు.

చికిత్స విధానం

వడ దెబ్బకు గురైన మూగజీవాలను వెంటనే నీడ ప్రాంతానికి చేర్చాలి. అవకాశం ఉంటే ఫ్యాన్లు, కూలర్ల ద్వారా చల్లని గాలి తగిలేలా చూడాలి. బాగా ఎండ ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో కడగాలి. చల్లని నీరు తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ మందులను వాడాలి. వైద్యుల పర్యవేక్షణలో పశువుల రక్తంలోకి లవణ ద్రావణాలు ఎక్కించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో మూగజీవాలు వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఉంటాయి. వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి వాటిని తరలించాలి. వడదెబ్బ తగిలిన పశువులకు వైద్యం అందించాలి. మధ్యాహ్న సమయాల్లో మూగజీవాలను బయటకు విడిచిపెట్టవద్దు. రోజుకి ఐదుసార్లు మూగజీవాలను నీటితో శుభ్రం చేయడం మంచిది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే మూగజీవాలు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. దీనిపై గ్రామాల్లో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ వాసు, పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు, నగరి

నగరి పశుసంవర్ధక సంచాలకుల పరిధిలో పశుసంపద వివరాలు

మూగజీవాలు	సంఖ్య
ఆవులు	22712
గేదెలు	1529
మేకలు	23989
గొర్రెలు	16063
మొత్తం	64293


ఎం.కొత్తూరులో ఇంటి ఆవరణలో కట్టి ఉన్న ఆవులు

క్లుప్తంగా

ప్రజా సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ


మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్

కార్వేటినగరం : ప్రజల సహకారంతో కార్వేటినగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో వ్యాపారులు, ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వ్యాపార సముదాయాల ఎదుట ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. చోరీలను అరికట్టేందుకు ప్రతి దుకాణంలో కనీసం రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అందులో ఒకటి రోడ్డు కనిపించేలా అమర్చుకోవాలన్నారు. అలాగే ప్రతి షాపు ముందు నో పార్కింగ్ బోర్డు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఆటోలను పార్క్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్షత్రియ సంఘ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శరత్‌కుమార్‌రాజు

పుత్తూరు: అఖిల భారతీయ క్షత్రియ మహాసభ–1897 (ఉత్తరప్రదేశ్) ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శరత్‌కుమార్‌రాజు చేతుల మీదుగా పుత్తూరులో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియులందరూ అభివృద్ధి చెందడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం నగరం రోడ్డులో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, సంఘ నాయకులు శివరాజు, నరేంద్రరాజు, బాలసుబ్రమణ్యంరాజు, సుబ్రమణ్యంరాజు, సుందరకుమార్‌రాజు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త రాధాకృష్ణా రెడ్డి శుక్రవారం తెలిపారు. పది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని, ఈ క్రమంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


జేసీబీతో దిబ్బ తొలగిస్తున్న దృశ్యం

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు, శెట్టివనత్తం పంచాయతీల్లో శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు, పేడదిబ్బలు తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, కార్యదర్శి జోత్స్న, స్థానిక నేతలు ధనంజయులు మణి, మాజీ సర్పంచ్ సుబ్బనాయుడు పాల్గొన్నారు.

బాణసంచా గోదాముల తనిఖీ


బాణాసంచా నిల్వలను పరిశీలిస్తున్న డీఎస్పీ

కార్వేటినగరం : మండలంలోని బాణసంచా గోదాములను డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్ శుక్రవారం తనిఖీ చేశారు. డీస్పీ మాట్లాడుతూ పిల్లలకు బాణసంచా అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాముల వద్ద ఇసుక బక్కెట్లు, ధూమపాన నిషేధ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలుదారులు అగ్గిపెట్టె, లైటర్, సెల్‌ఫోన్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి న్యాయశాఖ ఉద్యోగుల సత్కారం

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన అరుణ సారికను జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో జడ్జిని కలిసి, దుశ్శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. న్యాయశాఖ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు గోపినాథ్‌రెడ్డి, నాయకులు గిరిధర్‌రెడ్డి, లక్ష్మీపతి, గణేష్, బాలసుందర్, రవీంద్రరెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజ్, రెడ్డెప్ప, చంద్రశేఖర్, పవనకుమారి, భ్రమరాంబ, హేమ, మినిమా రాయల్ తదితరులు జిల్లా జడ్జిని కలిశారు.

చెస్ టోర్నీలో నగరి విద్యార్థిని ప్రతిభ


సినీనటుడు సప్తగిరి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న నవ్యశ్రీ

నగరి: తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహించిన అన్ రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్–15 బాలికల విభాగంలో మండలంలోని ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నవ్యశ్రీ ప్రతిభ చాటి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీనటుడు సప్తగిరి నుంచి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకుంది. నవ్యశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, చెస్ కోచ్ ఆనందమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



పాలసముద్రం : మండలంలోని కేజేపురం పంచాయతీ కుమ్మరిల్లులో శుక్రవారం ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయించారు. సర్పంచ్ భానుప్రియ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే నూతన బోరు వేసి నీటి ఇక్కట్లు తీరుస్తామని తెలిపారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉంటే ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తామని వివరించారు.

పరామర్శ..ఆత్మీయ సన్మానం


మాజీ మంత్రిని సత్కరిస్తున్న మండల పార్టీ నాయకులు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు నేతలను మాజీ మంత్రి ఆర్కేరోజా శుక్రవారం పరామర్శించారు. ఓబీఆర్ కండ్రిగలో పార్టీ నాయకులు మదన్మోహన్ రాజును, తిరుమన్యంకు చెందిన నియోజకవర్గ ఆర్టీఐ అధ్యక్షులు మదనమోహన్ రెడ్డిని, యువనాయకుడు దీపు తల్లిని, పార్టీ నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డేవిడ్‌ను ఆమె పరామర్శించారు. వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల నాయకులు నూతనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా నియమితులైన మాజీ మంత్రిని గజమాలలతోను, శాలువతోను సత్కరించారు. కార్యక్రమంలో వై. రాంప్రసాద్ రెడ్డి, మండల వైఎస్‌ఆర్‌సీపీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డాక్టర్ డేవిడ్‌కు పండ్లు అందజేస్తున్న మాజీమంత్రి ఆర్కేరోజా

చిన్నారికి ఆశీర్వాదం


చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: ఆళ్లమడుగు గ్రామంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లోకనాథరెడ్డి మనవడి బారసాలకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నారాయణస్వామిని రోశయ్య, గోవిందన్, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ వేర్వేరుగా సత్కరించారు. పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎర్రయ్య, మాజీ సర్పంచ్ రామచంద్రా రెడ్డి, పార్టీ యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, కార్య నిర్వాహక సభ్యులు మురళీ, దేవరాజులురెడ్డి, రోశయ్య, నాయకులు పురందర్‌రెడ్డి, పెద్దిరెడ్డి ఉమాచంద్రారెడ్డి, రాము, రామ్మూర్తి పాల్గొన్నారు.

తుంబకుప్పం వీఆర్ఏ దుర్మరణం

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం రెవెన్యూ సుధాకర్ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. సుధాకర్ మూడు రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తుంబకుప్పంలో సుధాకర్ భౌతికకాయాన్ని శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. వీఆర్ఏగా సుధాకర్ చేసిన సేవలకు గుర్తు చేశారు.

ముగిసిన కుంభాభిషేకం


కలశ ప్రదక్షిణకు తీసుకెళుతున్న పురోహితులు


కలశ ప్రదక్షిణకు తీసుకెళుతున్న పురోహితులు

విజయపురం: మండలంలోని పన్నూరులో ఆనంద వల్లీదేవీ సమేత ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జీర్ణోద్ధరణ, మహాకుంభాభిషేకం శుక్రవారం ముగిసింది. ఆలయంలో ఉదయం న్యాసహోమం, వేదపారాయణం, మహాపూర్ణాహుతి, అఖండ దీపారాధన, కలశప్రదక్షిణ, మహా కుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించి, రాత్రి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మదనగోపాలరాజు, మాజీ ధర్మకర్త విష్ణువర్ధన్ రాజు, ఆలయ కార్యనిర్వాహకులు రఘునాథ రెడ్డి, పురోహితులు బాలసుబ్రహ్మణ్యశర్మ, అన్నదాన నిర్వాహకులు కుమారస్వామిరాజు, శ్యాంసుందర్, గ్రామస్తులు భక్తవచలంరెడ్డి, ముకుందరెడ్డి, గజేంద్రనాయుడు పలువురు పాల్గొన్నారు.

అంబలి, గంజి పంపిణీ


అంబలి, గంజి పంపిణీ చేస్తున్న ఆలయ సేవకులు

నగరి: వేసవిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద పాదచారులకు అంబలి, గంజి పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు జ్యోతినాయుడు మాట్లాడుతూ, ప్రతి వేసవిలోను ఆలయం వద్ద అంబలి, గంజి, మజ్జిగ ఇస్తున్నట్టు చెప్పారు. రోజూ 250 మందికి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఉన్నతంగా విద్య


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంఈఓ


విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న ఉపాధ్యాయులు

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతంగా విద్యను అందిస్తున్నట్లు ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక దళితవాడలోని ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వం పాఠశాలల్లో బోధన ఉంటోందని వెల్లడించారు. కార్పొరేట్ మోజులో పడి నగదు వృథా చేసుకోకుండా సర్కారు బడిలో పిల్లలను చేర్పించాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, స్కూల్ కమిటీ చైర్మన్ సురేష్, ఉపాధ్యాయులు వెంకటేష్, ఏలుమలై, మోహన్, కోదండయ్య పాల్గొన్నారు.

బడిలో ప్రవేశానికి ప్రచారం

పాలసముద్రం : బడిలో చేర్పించాలని కోరుతూ బలిజకండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నరేష్ నేతృత్వంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. తమ పాఠశాలను ఆదర్శ పాఠశాల ప్రభుత్వం ప్రకటించిదని వెల్లడించారు. ఈ క్రమంలో ఓ విద్యార్థికి బడిలో అడ్మిషన్ ఇచ్చారు.

ఉపవాస దీక్షలతో 'గుడ్ ఫ్రైడే'


నగరి: తిరుపతి రోడ్డులో శిలువయాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు


వెంగళరాజుకుప్పంలో..

నగరి: మున్సిపల్, మండల ప్రాంతాల్లోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు ఉపవాస దీఓలతో గుడ్‌ఫ్రై డే ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై మరణించే ముందురోజు గురువారం రాత్రి రోమన్ సైనికులకు పట్టుబడతారు. ఆ రాత్రే ఆయన ఆఖరి భోజనం చేస్తారు. దానిని పురస్కరించుకొని గురువారం రాత్రి నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం శిలువ యాత్రను నిర్వహించారు. చర్చిలలో క్రైస్తవులు ఉపవాస దీక్షలతో గుడ్ ఫ్రైడే ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. యేసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటల గురించి పాస్టర్లు వాక్య సందేశమిచ్చారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

కార్వేటినగరం : స్థానిక బీసీ కాలనీలోని బేతేల్ షారోన్ చర్చిలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన చేపట్టారు. ఆశీర్వాదం మాట్లాడుతూ ఏసు ప్రభువు శిలువపై పలికిన ఏడు వ్యాఖ్యలను వివరించారు. అలాగే రాజా వీధిలోని యెహోవా ఈరే చర్చిలో పాస్టర్ అగస్టీన్ సరోజిని ఆధ్వర్యంలో కూడా గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలోనే పాదిరికుప్పం, అల్లాగుంట, కొల్లాగుంట సీఎస్ఐ, టీకేఎం పేట, గోపిశెట్టిపల్లి, కొటార్వేడు, గాజంకి, యర్రమరాజుపల్లి, కత్తెరపల్లి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో హరిబాబు, బాబు పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం చర్చిలో పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్రీకావేరిరాజుపురం చర్చిలో మాస్టర్ పాల్‌రాజ్ మాట్లాడుతూ క్రీస్తు ఈ లోకంలో జన్మించి 2వేల ఏళ్లు పూర్తయిందని, మళ్లీ ఆయన తిరిగి ఈ లోకానికి వస్తారని వెల్లడించారు.


నగరి: సెయింట్ మేరీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


కార్వేటినగరంలోని షారోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి: అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం వైట్ హౌస్ ఫ్యాక్టరీ కార్మికులకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బందితో పాటు ఫ్యాక్టరీకి వెళ్లిన ఆయన అగ్ని ప్రమాదాల నివారణ, మంటలను ఆర్పే ప్రక్రియలను తమ వద్ద ఉన్న ఆధునిక పరికరాలతో ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మోహన్, సత్య, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.